క్లుప్తంగా

శివయ్యకు పల్లకీ సేవ



పల్లకీ వాహనంలో ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. రాత్రి ఆలయంలో గంగా, పార్వతీ సమేత శివయ్యకు పల్లకి వాహన సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడాకారిణి భార్గవికి సత్కారం



భార్గవిని సత్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి : జాతీయ, రాష్ట్ర స్థాయి షాట్‌పుట్, జావలిన్ త్రో పోటీల్లో ప్రతిభ కనపరిచిన వి.భార్గవిని రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. పదవ తరగతి చదువుతున్న భార్గవి జాతీయ స్థాయి ఇంటర్ స్థాయి మీట్‌లో భాగంగా పంజాబ్ రాష్ట్రం పోటీయాలలో జరిగిన షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ మీట్‌లో జావలిన్ త్రోలో బ్రౌన్ మెడల్ సాధించింది. సోమవారం మండలంలోని సుబ్బారాయుడు గూడెం గ్రామంలో భార్గవికి రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి, దుస్తులు, షూస్ కొరకు రూ.16,000 అందజేసి సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు గుమ్మళ్ళ నరశింహారావు, చిక్కాల నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

చింతలపూడి : యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ డా బాణావతు రాంబాబు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మానస అధ్యక్షతన జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీలో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య శాఖ సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందజేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి, సర్పంచ్ రాణి, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

జంగారెడ్డిగూడెం : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ధర్మన్న స్మారక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అకాల వర్షాలు, వడగండ్ల వానలు పడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సమావేశంలో ధర్ముల సురేష్, కేవీ రమణ పాల్గొన్నారు.

వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం : చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. తాడువాయికి చెందిన దేశబోయిన మంగ గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి వచ్చిన భర్త దేశబోయిన నాగరాజు పరిస్థితిని గమనించి ఆమెను వెంటనే తాడువాయి పీహెచ్‌సీకి, అక్కడి నుంచి జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

కుకునూరు : విద్యుదాఘాతానికి గురై ఐదు గేదెలు మృత్యువాత పడిన ఘటన సీతారాంనగరంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం అకాల వర్షాలకు సీతారాం నగర్ గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆదివారం మేతకు వెళ్లిన గుంపుల కృష్ణకు చెందిన రెండు గేదెలు, లింగంపల్లి చంద్రం చెందిన ఒక గేదె, లింగంపల్లి కిట్టయ్య చెందిన ఒక గేదె, ఏలూరి శ్రీనుకు చెందిన ఒక గేదె మొత్తం ఐదు గేదెలు మేత మేస్తూ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. కాగా పశువుల కాపరులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల వివరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటనలో విద్యార్థులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లిన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ షోకాజ్ నోటీసులు జారీ చేసిన సంగతి విదితమే. షోకాజ్ నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి తమ వివరణ సమర్పించారు. వారి వివరణలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు డీఈఓ కార్యాలయవర్గాలు తెలిపాయి.

స్పందనలో వినతి

చింతలపూడి : ప్రగడవరం పంచాయతీ, శ్రీరాంపురంలోని లేఅవుట్లో ఉన్న సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని సర్పంచ్ టి.భూపతి, ఉప సర్పంచ్ ఎస్ రమేష్‌రెడ్డి సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందచేశారు.

శక్తిస్వరూపిణికి గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీనూకాలమ్మ అమ్మవారి 59వ ఉగాది వార్షిక జాతరను పురస్కరించుకుని నాలుగో రోజు సోమవారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక తాండ్రపాపారాయుడు సెంటర్ వెలమ రామాలయం నుంచి ఆలయకమిటీ ఏర్పాటుచేసిన ప్రత్యేక సింహవాహన రథంపై మేళతాళాలతో, భాజాభజంత్రీలు, గరగాటలు, భజన కోలాటాలు, తీన్మార్ డప్పులు, విచిత్ర వేషధారణల నడుమ అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు), వెంకట రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి గ్రామోత్సవం ప్రారంభించారు. ప్రధానార్చకులు యర్రమిల్లి మనోజ్‌శర్మ రథంపై ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ప్రసాదం, కుంకుమ అందజేశారు. శ్రీనూకాంబిక సేవా బృందం, యువత గ్రామోత్సవంలో తమ సేవలను వినియోగించారు. గ్రామోత్సవం పట్టణ ప్రధాన వీధులగుండా సాగగా ఎక్కడికక్కడ అమ్మవారికి ఓరపోస్తూ, కొబ్బరికాయలు సమర్పిస్తూ జై నూకాంబికా, జై జై నూకాంబికా నామస్మరణతో జంగారెడ్డిగూడెం పట్టణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తొలుత అమ్మవారికి, నర్మదా అమృత బాణలింగేశ్వరస్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అమ్మవారిని స్వర్ణకవచాలతో సుందరంగా అలంకరించారు.



సింహవాహనంపై కొలువైన నూకాలమ్మ తల్లి



ఆలయంలో స్వర్ణ కవచాలతో దర్శనమిచ్చిన నూకాలమ్మ

జాతరలో భాగంగా మంగళవారం కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తామని, 108 స్వర్ణపుష్పాలతో అర్చన నిర్వహిస్తామని, సాయంత్రం శ్రీకృష్ణ పురం దరదాస భజన బృందం వారిచే హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణ, కోలాటం ఉంటాయని పండు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, సేవా బృందం సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ వార్షిక ఉత్సవాలు ప్రారంభం

కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో కొలువైన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 11వ వార్షిక మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. జాతీయ ప్రధాన రహదారికి ఆనుకుని రామకోనేరు గట్టుపైన ఉన్న ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, విఘ్నేష్ దంపతులు అమ్మవారి ఉత్సవ మూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. ఐదు రోజులపాటు సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, చివరి రోజున అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

162 ద్రవ్యాలతో అభిషేకం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీచక్ర సహిత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి తృతీయ వార్షిక వేడుకలు రెండో రోజు కొనసాగాయి. సోమవారం ఉదయం ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు కాజా ఫణికుమార్ శర్మ, బొడ్డు సత్యనారాయణగుప్త లోకకల్యాణం కోసం శైవాగమ విధానంలో 162 విశేష ద్రవ్యాలతో విశిష్ట అభిషేక సేవ నిర్వహించారు. బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ 162 ద్రవ్యాలను సేకరించి సమకూర్చడంలో సహకరించిన గుంటూరు జిల్లా, తాళ్లాయపాలెం శ్రీశైవక్షేత్రం శైవాగమ వైశ్యఅర్చకులు బొడ్డు సత్యనారాయణ గుప్తకు ఆలయకమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. తొలుత విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం విశిష్ట అభిషేకం జరిపి నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పట్టణంలో నూకాలమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెంలో ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



బయ్యనగూడెంలో ముత్యాలమ్మకు గ్రామోత్సవం

టీడీపీ ఎమ్మెల్యేల తీరు దురదృష్టకరం

జంగారెడ్డిగూడెం : టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు దురదృష్టకరం అని, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చరిత్రలో ఇది ఒక బ్లాక్‌డేగా నిలిచిపోతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి) అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా, టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం చుట్టుముట్టి, స్పీకర్‌పై కాగిత ముక్కలు వేస్తూ ఇబ్బంది పెడుతుంటే, అపేందుకు ప్రయత్నించిన సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడి చేయడం అమానుషం అన్నారు. ఆయన్ను తోసివేయడంతో చేతికి గాయం కూడా అయ్యిందన్నారు. వెంటనే మరికొందరు ఎమ్మెల్యేలు, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి స్పందించి టీడీపీ వారిని వారించే ప్రయత్నంచేస్తుంటే వారిపై కూడా టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేశారన్నారు. అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి చెందిన 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, వారు తిరిగి దాడి చేస్తే అధికార పక్షాన్ని అప్రతిష్టపాలు చేయడానికి టీడీపీ దుర్గారపు ఆలోచన సిగ్గు చేటన్నారు. టీడీపీ తీరుపై ప్రజలు విసిగిపోయారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరలా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మన్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు





గొట్టాలరేవులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం, రెడ్డిబొడ్డేరులో స్ప్రేయింగ్ పనులు చేస్తున్న దృశ్యం →

బుట్టాయగూడెం : బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మన్యంలో గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకుండా ఉండేవిధంగా వైద్యఆరోగ్య సిబ్బంది తగు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మలేరియా శాఖ ఆధ్వర్యంలో వర్షాలకు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందకుండా మలాథియన్ స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. సోమవారం మండలంలోని మారుమూల గ్రామమైన గొట్టాలరేవు, చింతకొండ, పూచికగొంది గ్రామాల్లో దొరమామిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ ఏఎస్‌వీ ప్రవీణ్ గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ మార్పుల వల్ల సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున వేడి నీరు కాచి తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, జె.వాసంతి, జి. ప్రమోదిని, కె. కన్నపరాజు, కె.జగదాంబ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు ఆధ్వర్యంలో తెల్లవారిగూడెం, కొరుటూరు, రెడ్డిబొడ్డేరు గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని ఆయన సూచించారు. అలాగే తప్పనిసరిగా దోమతెరలను వినియోగించుకోవాలన్నారు. మోతుగూడెం, రెడిడబొడ్డేరు, కొరుటూరు, తెల్లంవారిగూడెం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున 4 మలేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి ఆయా గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు చేసి ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

లింగపాలెం : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలను, లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరి వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వెంకటలక్ష్మి మట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వహించరాదన్నారు. మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. వైస్ ఎంపీపీ మట్టా సురేష్ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు బేసెమెంట్‌లో మట్టి వేసుకునేందుకు అవకాశం లేకపోవటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి తోలకాలకు అనుమతులు ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. దీనిపై తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీల తీర్మానాలతో ఇళ్లకు మట్టి తోలుకునేందుకు ఇరిగేషన్ అధికారులతో అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను అందుబాటులో తీసుకురావాలని ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబు కోరగా, లబ్ధిదారులకు ఇసుక ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరావు సమాధానమిచ్చారు. కొన్ని గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు రుణాలు అందించే విషయంలో కొందరు వీఓఏలు, సీఏలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపింపించగా దీనిపై వెంటనే విచారణచేపట్టాలని ఎంపీడీఓ ఆశీర్వాదం, ఏపీయంకు ఆదేశించారు. తుపానుకు దెబ్బతిన్న పంట వివరాలను అగ్రికల్చర్ అసిస్టెంట్లు నమోదు చేస్తున్నట్లు ఏఓ మురళీకృష్ణ తెలిపారు. పంట నష్టం జరిగిన రైతులు నమోదుచేయించుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్ రాజు, వైస్ ఎంపీపీ కర్లపూడి జాన్సీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

రూ.1.97 కోట్లు వడ్డీ రాయితీ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఇంటిపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించిందని, దీంతో పట్టణంలో ఇంటి పన్ను చెల్లించే వారికి రూ.1.97 కోట్లు రాయితీ లభించనుందని మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటి పన్ను చెల్లింపుదారులకు రూ. 1.39కోట్లు, ఖాళీ స్థలాలపై పన్ను చెల్లించే వారికి రూ.58 లక్షలు, మొత్తంగా 1.97 కోట్లు పన్ను చెల్లింపుదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

కబేళా ఆసీల వేలం

పట్టణంలో కబేళా ఆసీల వసూలుకు వేలం నిర్వహించినట్లు కమిషనర్ చెప్పారు. వేలంలో పాటదారుడు ప్రసాద్ రూ.1.15 లక్షలకు పాడుకున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ. 87వేలు మాత్రమే వచ్చింది అని చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు

అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు గాని, లేఅవుట్‌లు గాని వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ హెచ్చరించారు. అలాగే నిర్మాణాలు చేసే వారు ప్రభుత్వ స్థలాన్ని గాని, రోడ్డు మార్జిన్ ఆక్రమించకుండా నిర్మాణాలు చేసుకోవాలని, ఆక్రమణకు గురైనట్లుగా గుర్తిస్తే అటువంటి నిర్మాణాలు తొలగిస్తామన్నారు. ఇప్పటికే అనుమతులు ఉల్లంఘించిన 6 నిర్మాణాలపై చార్జిషీట్ వేశామని, మరో ఆరు నిర్మాణాలు గుర్తించామన్నారు. ఛార్జిషీట్ దాఖలు చేసిన వాటిపై కోర్టు అనుమతి పొందిన తరువాత తొలగించడం గాని, అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందన్నారు. కాగా కొంతమంది ముఠాగా ఏర్పడి ఇంటి ప్లాన్‌లు తెప్పిస్తాం అంటూ ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారి వలలో పడి నష్టపోవద్దన్నారు. నేరుగా సచివాలయంలో గాని, మున్సిపల్ కార్యాలయంలోని సంబంధిత అధికారులను సంప్రదించి అనుమతులు పొందాలన్నారు. టీపీవో జగదీష్, ఆర్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్

భూ రికార్డుల పరిశీలన

బుట్టాయగూడెం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చొప్పనపల్లి గ్రామం గ్రామ నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం మండలంలో సేకరించిన భూముల పట్టాలను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భూసేకరణ అధికారులు పరిశీలించారు. చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండలం కోయరాజమండ్రి పరిసర ప్రాంతాల్లో భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న రైతుల నుంచి భూమి వివరాలను పరిశీలించిన అనంతరం రైతుల నుంచి అంగీకార పత్రాలను తీసుకున్నారు. చొప్పనపల్లి గ్రామానికి సంబంధించి పునరావాస కాలనీను రామన్నగూడెం సమీపంలో నిర్మించారు. అయితే వీరికి భూమికి భూమి ఇచ్చేందుకు ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో సుమారు సుమారు 70 మంది రైతులు 127.56 ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ ప్రజ్ఞ, కేఆర్‌పురం ఐటీడీఏ ఓఎస్‌డీ ఎండీ మహుద్దీన్, ఆర్అండ్ఆర్ అధికారి భద్రయ్య, వీఆర్ఓలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న భూసేకరణ అధికారి

వాహనాల వేలం ద్వారా రూ.69 వేల ఆదాయం

ద్వారకాతిరుమల: మండల పరిధిలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలాన్ని నిర్వహించారు. మూడు బైక్‌లను జీఎస్టీతో కలిపి రూ. 69,620 కు వేలంలో విక్రయించారు. ఈ సొమ్మును ట్రెజరీకి జమ చేస్తామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

టీడీపీలో రాజుకుంటున్న వర్గపోరు

కొయ్యలగూడెం : టీడీపీలో వర్గ పోరు రాజుకుంటోంది. ఎంతెలా అంటే పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి దండ వేయడానికి కూడా అడ్డపడేంతగా పరిస్థితి దిగజారింది. టీడీపీ తమ్ముళ్ల కుమ్ములాటపై సర్వత్రా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. కొయ్యలగూడెంలో టీడీపీ వర్గీయులు రెండు గ్రూపులుగా విడిపోయి వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్సీల విజయోత్సవ నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం సాయంత్రం మెయిన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యక్రమం నిర్వహించడానికి తలపెట్టారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, ప్రస్తుత పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాస్ వర్గీయులు వేడుకలు నిర్వహించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో అధికారిక మండల కమిటీ ప్రకటించకుండా విగ్రహానికి పూలమాల వేయనీయమని వ్యతిరేక వర్గీయులు వాగ్వివాదానికి దిగారు. దీనికి తోడు ఇటీవల మండల కమిటీ నియామక విషయంలో ఏర్పడిన వ్యతిరేకత వైరి వర్గాల్లో ఘర్షణకు కారణమైంది. దీంతో ఒక వర్గం నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద బైఠాయించి వేరొక వర్గం నాయకులు పూలమాలలు వేయకుండా అడ్డుపడ్డారు. చివరకు ఇరువర్గాలలోని ఏ ఒక్కరు ఎన్టీఆర్ విగ్రహానికి దండ వేయకపోవడం గమనార్హం. దీంతో ఒక వర్గం వారు పోలవరం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్లో కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఇరువర్గాల నాయకులు పార్టీ పరిశీలకులైన మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు వద్దకు ఈ పంచాయితీని తీసుకువెళ్లేందుకు సంసిద్ధులయ్యారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద బైఠాయించిన దృశ్యం

శ్రీవారి సన్నిధిలో..



స్వామివారి మెమెంటో అందుకుంటున్న రాజీవ్ అగర్వాల్

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సీజీఎం రాజీవ్ అగర్వాల్ సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

దాసరోజుకు సత్కారం



దాసరోజును సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : గుంటూరుకు చెందిన శ్రీ విశ్వకర్మ పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఏటా అందించే ఉగాది పురస్కారాల్లో భాగంగా దేశవ్యాప్తంగా జోతిష్య శాస్త్రం గురించి చేసిన ప్రచారానికి గాను కొయ్యలగూడెం మండలానికి చెందిన డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావుకు ఉగాది పురస్కారం అందించింది. ఈనెల 19న చుట్టుగుంట పోలేరమ్మ గుడిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిమిదవ తరం వంశీయులు వీరభట్లయ్య ఈ పురస్కారం అందజేశారు. కొయ్యలగూడెంకు చెందిన శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఈ సందర్భంగా దాసరోజును అభినందించింది. పీఠం వ్యవస్థాపకులు వజ్రాల శివకుమార్, సింధుమాత, వి.పరబ్రహ్మ, వై.నరేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

బుట్టాయగూడెం : వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ పి. శ్రీహరి కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులు, వీఆర్ఓలు, డిజిటల్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు రక్ష పథకానికి సంబంధించి సర్వేను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కొయ్యలగూడెం : అకాల వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న పంటల వివరాలను పూర్తి సమాచారం సేకరించి ఏప్రిల్ 3వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు పేర్కొన్నారు. సోమవారం మండలంలో పలుచోట్ల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఇప్పటి వరకు 30 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు చెప్పారు. కాగా వర్షాల వలన వర్జీనియా పొగాకు తోటలకు ఏ విధమైన ఇబ్బంది లేదని కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి గ్రేసీ మార్కెట్ పేర్కొన్నారు. దిప్పకాయలపాడు, కన్నాపురం ప్రాంతాలలోని తోటలను పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రదర్శనను సందర్శిస్తున్న విదేశీ మహిళలు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. అందులో పాల్గొన్న జైపాల్ టీంకు చెందిన విదేశీ మహిళలు ముందుగా డ్వాక్రా మహిళలతో ముఖాముఖి జరిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంద్వారా మిర్చి పంటను పండిస్తున్న రైతులతో మాట్లాడి, కెమికల్, ఆర్గానిక్‌కి మధ్య తేడాను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం స్టేట్ అధికారి ప్రకాష్, జిల్లా అధికారి తాతారావు, ఎస్ఎఫ్ఏ నాగరాజు, జోనల్ కోఆర్డినేటర్ హుస్సేన్, మండల ఇన్‌చార్జి గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.